INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY ADVANCED RESEARCH TRENDS
ISSN : 2349-7408
VOLUME IV, ISSUE 1(3) JANUARY, 2017

# ఆహార భద్రత - ముందున్న పెనుసవాళ్ళు

( 2016, డిసెంబరు 22, 23, 24 తేదీలలో- ఆంధ్రా లొయొలా కళాశాల, విజయవాడలో వృక్షశాస్త్ర శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడురోజుల అంతర్జాతీయ సదస్సులో సమర్పిస్తున్న గోష్ఠీ పత్రం )

**డాక్టర్. రెంటపల్లి. రవీంద్రభాస్**
రీడర్, తెలుగుశాఖ
ఆంధ్రా లొయోలా. కళాశాల
విజయవాడ - 520 008
చరవాణి - 9848389900

'తిండి కలిగితే కండ కలదోయి

కండ కలవాడేను మనిషోయ్' అంటాడు తెలుగు కవి గురజాడ అప్పారావు.

కానీ నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎందరు సరి అయిన ఆహారాన్ని పొందుతున్నారు అనేది ప్రశ్నార్ధకమే. ప్రతి ఒక్కరికి పోషక ఆహారం అనేది ప్రాధమిక హక్కు. కాని ఎందరికి సరి అయిన ఆహారం లభిస్తోంది? ఆహార భద్రత అనేది ఎలా ఉంది? ఎంత ఉంది? అసలు ఆహారభద్రత అంటే ఏమిటి? "ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలు శారీరకంగా, సామాజికంగా, ఆరోగ్యంగా క్రియాశీలంగా పనిచేయటానికి అవసరమైన ఆహారం వారి జీవన ప్రమాణాల ననుసరించి, వారి అభిరుచులను అనుసరించి లభిస్తూ ఉంటే సరి అయిన ఆహారభద్రత లభించినట్లే". అయితే ఇది ఎంత మటుకు అమలు అవుతున్నది అనే విషయాన్ని పరిశీలిస్తే దీనికి ప్రధానంగా కావల్సిన అంతర్గత అంశాలు :

- **లభ్యత**
- **పొందటం**
- **వాడకం**
- **స్థిరత్వం**

**ఇందులో మొదటిది లభ్యత :** ఆహార సంబంధిత తృణధాన్యాలు, పప్పులు, వరి వంటివి పంపిణీ, వాణిజ్యం అనేది పరిమాణంలోనే కాక నాణ్యతలో కూడా మెరుగ్గా ఉండాలి. పుష్కలమైన ప్రకృతి వనరులు, స్థిరమైన ఉత్పాదక శక్తి కలిగిన వ్యవసాయ పద్ధతులు అనుసరించటం, ఉత్పత్తులను సరి అయిన విధంగా అభివృద్ధి చేసేందుకు అవసరమయిన ప్రణాళికలను రూపొందించుకున్నప్పుడే నాణ్యమయిన ఆహార ధాన్యాలను

పొందగలము. పండించిన ఉత్పత్తులను సరి అయిన విధంగా మార్కెటింగ్ చేయటం, చిన్న వ్యాపారులు లాభపడేలా, వారికి అందుబాటులోకి తేవటం, మొదలయినవి చేయటం ద్వారా వచ్చిన పంటను వెంటనే ప్రజలకు చేరువ చేయవచ్చు. మనిషి ఆరోగ్య పరిస్థితి అనేది అతని ఆహార అలవాట్లనుబట్టి, తయారీ విధానాన్ని అనుసరించి, వివిధ రకాల పదార్థాలతో (పప్పులు+తృణధాన్యాలు+ఆకుకూరలు) ఇలా విభిన్న రకాలను కలిపి వండటాన్ని బట్టి అతని ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. సరి అయిన పద్ధతిలో ఆహారాన్ని తీసుకోవటం అన్నది తప్పనిసరి.

అయితే అనుకోని వాతావరణ పరిస్థితులు పంటలను దెబ్బ తీసినప్పుడు పంట నష్టం జరిగి అవసర మయినంత ఆహార ధాన్యాలు ప్రజలకు అందుబాటులోకి రావు. ఉన్న కొంత పంటను రైతు అధిక ధరకు అమ్మినప్పుడు దానిని పేదవాడు కొనలేడు దానితో అతని ఆదాయంలో అధిక శాతం తన ఆహారానికి ఖర్చు పెట్టవలసి వస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య ఇది.

ప్రపంచంలోని అధిక శాతం ఆదాయం ఆహారానికి వినియోగించటం గమనార్హం. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ఆకలిని తీర్చేందుకు మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్ (MDG) ప్రయత్నిస్తోంది. దీనిలో అది గణనీయమైన ప్రగతిని సాధించింది. ఆస్ట్రేలియా ఆహారభద్రతపై ప్రముఖంగా దృష్టిసారించి దాని గురించి కృషి చేస్తోంది. ఆసియా, ఆఫ్రికా దేశాలతో అది తన వ్యవసాయ పరిశోధనల విజ్ఞానాన్ని పంచుకుంటోంది. వారిని దీర్ఘకాలిక వ్యవసాయ ఉత్పత్తులకు ప్రోత్సహిస్తూనే, ప్రజలకు అత్యవసరంగా కావల్సిన ఉత్పత్తులపైన కూడా దృష్టి పెడుతోంది. ఆస్ట్రేలియా ఇందుకు వ్యవసాయ పరిశోధకులతో, విశ్వవిద్యాలయాలతో వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో నిరంతరం సలహా సంప్రదింపులు జరుపుతూనే ఉంది. ఆహార లోపం అనేది చిన్న పిల్లలలో సాధారణంగా కనిపిస్తోంది. పుట్టిన బిడ్డకు 1000 రోజులలోపు సరి అయిన పోషకాహారం అందించకపోతే వారికి శారీరక అవసరాలతోపాటు, మానసిక ఎదుగుదల కూడా లోపించి చివరికి మరణించవచ్చు. సరి అయిన ఆహారం లేక విటమిన్ లోపంతో దాదాపు 2 మిలియన్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ఇలా ఉంటే ఇండియాలో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇండియాలో విభిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎక్కువ మొత్తంలో పోషకాహారాలు తీసుకుని అధిక బరువుతో తత్సంబంధ ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు కొందరైతే, పోషకాహారలోపంతో బాధపడేవారు కొందరు. 2005-06లో

జరిపిన ఒక సర్వే అవివాహిత యువతులలో 1/3 % రక్తహీనతతో బలహీనవుతున్నారని ఉండవలసిన దాని కన్నా తక్కువ బరువును కలిగి ఉన్నారని అలాగే యువకులలో కూడా 28% రక్తహీనతతో ఉన్నారని తేల్చింది. స్త్రీలు 15%, పురుషులు 12% ఉండాల్సిన దానికన్నా అధిక బరువును కలిగి ఊబకాయులు అవుతున్నారని తేల్చింది. ఇక పిల్లల విషయానికి వస్తే ఆఫ్రికా ఆసియా దేశాలలోని చిన్న పిల్లల కన్నా కూడా ఇండియాలోని పిల్లల పరిస్థితి హీనంగా ఉంది. 3 నెలల నుంచి 3 సం॥ వయసు పిల్లలో 79% మంది పిల్లలు రక్తహీనతను కలిగి ఉన్నారు. ఈ అసమానతలు ఆర్థికాభివృద్ధి మీద ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ప్రణాళికలు రచించే సమయంలో వీటి ప్రభావం కనిపిస్తోంది. ప్రజలందరికీ సమానంగా శారీరక, మానసిక అవసరాలను తీర్చేలాగా ఆహారం, తత్సంబంధ పదార్థాలు అందుబాటులో ఉండాలనే ప్రాథమిక హక్కును ఈ పరిస్థితి పరిహసిస్తోంది.

దీనిని అధిగమించేందుకు ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలపై నిర్వహించిన అనేక చర్చలలో "నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్టు"ను ప్రవేశపెట్టాలని, పెరిగే ధరలను అదుపులో పెట్టాలని, ప్రజలకు అందుబాటు ధరలలో ఆహారపదార్థాలు పంపిణీ చేయాలని, ఆహారపదార్థాల సరఫరా, పంపిణీలలో అవినీతిని నిరోధించి ప్రజలకు అందేలా చూడాలని సూచించటం జరిగింది. కాని చౌకదుకాణాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న బియ్యం, పప్పులు, నూనెల వంటివి ఎంత నాణ్యంగా ఉంటున్నాయో అందరికీ తెలుసు. ప్రజలకు అందుబాటు ధరలో రూపాయికి కిలో బియ్యం చొప్పున ఇస్తున్న బియ్యంలో పేదలకు అందుతున్నది ఎంత? వ్యాపారులు కాజేస్తున్నది ఎంత? అనేది పట్టించుకునే వారు లేరు. రేషన్‌షాపుల్లో పక్కదారిన అమ్ముకుని సొమ్ము చేసుకుంటూ పేదలకు చుక్కలు చూపిస్తున్నా అడిగేవారు లేరు. ప్రభుత్వ పథకాలకు తూట్లు పొడుస్తూ అవినీతిపరులు, అవినీతి అధికారుల అండదండలతో చట్టాలలోని లొసుగులను అధారంగా చేసుకొని ప్రజలకు చేరవలసిన ఆహార పదార్థాలను వారికి చేరనీయటంలేదు. ఆహార భద్రతపై చర్చించే వారంతా లోపాలను గురించి చర్చించటం, తీసుకోవలసిన విధి విధానాలను సూచించటం తప్ప సమాజాన్ని ఆ దిశగా జాగృతం చేసే దిశగా ఆలోచించటం లేదు.

భారతదేశం ముందున్న అతి పెద్ద సవాలు ఇదే. ప్రజలందరికి సమానంగా పండిన పంటను అందుబాటులోకి తేవటం, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇండియా తన వాణిజ్య విధానాలను అంతర్జాతీయంగా సవరించుకోవటం. అలాగే పరిమాణంలోను, నాణ్యతలోను ఆహారపదార్థాల కొనసాగింపుకు తగిన సహాయ సహకారాలు అందించటం.

ప్రతి ఒక్కరికి ఆహారధాన్యాలు అందించే దిశగా 'నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ బిల్లు'ను 2013లో ప్రభుత్వం తీసుకువచ్చింది. దీని ద్వారా 1.2 బిలియన్ల ప్రజలకు లబ్దిచేకూరుతుంది. ఆహారధాన్యాలు, తృణధాన్యాలపై సబ్సిడీని ఇవ్వటం ఇందులోని ముఖ్యాంశం – ప్రతి నెల 5 కిలోల ఆహార ధాన్యాలను ఇవ్వటం వల్ల 75% గ్రామీణ ప్రాంత ప్రజలకు, 50% పట్టణ ప్రాంత ప్రజలకు దీనివలన లబ్ది చేకూరుతుంది. 3 రూ॥లకు కిలో బియ్యం, 2 రూ॥లకు కిలో గోధుమలు, 1 రూ॥కే పప్పులు ఇవ్వటం ఇందులో ముఖ్యమైన అంశం. NFSA బిల్లులో పొందుపరిచిన 'ముఖ్యాంశాలు' మధ్యాహ్న భోజన పథకం, శిశు సంక్షేమ పథకాలన్నిటిని సంధానించటం, నిత్యావసర సరుకుల సరఫరా మొదలగునవి. మధ్యాహ్న భోజన పథకంతోపాటు గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు ఉచితంగా ధాన్యం సరఫరా చేయటం కూడా ఉంది. అయితే ఇది కార్యరూపంలోకి వచ్చేసరికి వివాదాస్పదమయింది. దీనిని రాష్ట్ర ప్రభుత్వాలు వారికి అనుకూల సమయంలో ఆచరణలోకి తీసుకువచ్చాయి. రేషన్ కార్డు ద్వారా రేషన్‌షాపులల్లో సరుకుల పంపిణీ చేయటం జరుగుతుంది. అయితే అవినీతిపరులయిన అధికారులు, షాపు యజమానులు వీటిని తమ ఇష్టానుసారం అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు తప్ప ప్రజలకు నాణ్యమైన సరుకు లభించటం లేదు. శోచనీయమైన విషయం ఏమిటంటే ఈ బిల్లును ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టడం. దీనిని ఓటు బ్యాంకు రాజకీయంగా ప్రతిపక్షాలు విమర్శించటం ప్రజలకు మేలు చేసే ఈ బిల్లును సక్రమంగా అమలుచేసేలా చూసే బాధ్యతను ఎవరు తీసుకోకపోగా దానివల్ల తమకు కలిగే లబ్దిని గురించి ఆలోచించేవారే ఎక్కువయ్యారు. అలాగే కేవలం కొన్నిటికి మాత్రమే ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి మిగిలిన వాటి ధరలు పెరిగినా పట్టించుకోవటం లేదని, ప్రజలకు అందుబాటులో పోషకాహారం దొరకటంలేదని విమర్శలు వినిపించాయి. ప్రజలకు అందుబాటు ధరలలో కూరగాయలు, పళ్ళు, ఆకుకూరలు, పోషక పదార్థాలను అందించే ఆహారాలు వంటి నిత్యావసరాలను కూడా ఉంచాలని వీరు వాదిస్తున్నారు.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే పంట పండే నేలలు నెమ్మదిగా తగ్గటం ఇంకో ఎత్తు. ఇందుకు కారణాలు అనేకం. వ్యవసాయ పరిశోధనలకు నిధులు చాలినంత కేటాయించకపోవటం, నీటికొరత, గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల లేమి వంటి వాటివల్ల కూడా ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతోంది. అలాగే రైతులకు వాతావరణ పరిస్థితులపట్ల సరి అయిన అవగాహనలేకపోవటం, అకాల వర్షాలు, వర్షాలు లేకపోవటం ఇటువంటి వాటితోపాటు తుఫానులు, వరదలు కూడా పంట నష్టానికి కారణమవుతున్నాయి. వీటితోపాటు రకరకాల తెగుళ్ళు, అధిక మోతాదులో ఎరువుల వాడకం, దానివల్ల భూసారం తగ్గిపోవటం, పంట పొలాలను ఇంటి

స్థలాలుగా మార్చటం. మొదలైన వాటితో పారిశ్రామికీకరణ పేరుతో పండే చెట్లను నరికివేయటం కూడా ఆహార కొరతకు తోడ్పడుతోంది. పెరుగుతున్న జనాభాతోపాటు ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగకపోవటం వల్ల ఈ పరిస్థితి తల ఎత్తుతోంది. పేదరికం, నిరక్షరాస్యత కూడా ప్రజలను సరిఅయిన దారిలో నడిపించలేక పోతున్నాయి. రక్షిత మంచినీరు, మరుగుదొడ్లు ఉపయోగించటం, రోగ నిరోధక శక్తిని పెంపొందించే దిశగా ప్రజలను చైతన్యపరచటం, ప్రజారోగ్య సేవలను మెరుగుపరచటం వంటివి కొంతవరకు ప్రజలకు మెరుగైన జీవనశైలిని అందిస్తాయి. ఇవన్నీకూడా పరోక్షంగా ప్రజల ఆరోగ్యం మీద ప్రభావం చూపేవే. కొత్త వంగడాలను సృష్టించటం వాటిని రైతులకు పరిచయం చేసి వాటి ద్వారా లబ్ధి చేకూరేలా చేయటం, పండిన పంటను సరి అయిన దిశగా అమ్ముకునేలా తోడ్పాటును అందించటం, పంటల మధ్య విరామం పాటించేలా చూడటం, అంతర పంటలను ప్రోత్సహించటం, వాణిజ్య పంటలను, ఔషధ మొక్కలను పెంచటం ద్వారా రైతులకు లాభాలు చేకూరేలా చేయటం ఇవన్నీ కూడా ఆహారభద్రత మీద ప్రభావాన్ని చూపించేవే. సకాలంలో రైతులకు ఋణమాఫీని ప్రకటించటం, వడ్డీ తగ్గింపు వంటి ప్రోత్సాహకాలను అందించటం వంటి ద్వారా ప్రభుత్వం రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తోంది.

వ్యవసాయ ఉత్పత్తులను పెంపుదల చేయటం కన్నా రైతుల ఆదాయం పెంపుదిశగా విధానాలు మళ్ళింపు చేయాలని ప్రస్తుత ప్రభుత్వం నియమించిన కమిటీ సూచించింది. లాభసాటి పంటలతోపాటు మత్స్య, పశు సంపదలను పెంచుకుంటూ ఆదాయాన్ని మెరుగుపర్చుకోవాలని సూచించింది. బిందు సేద్యం, వాటర్ గన్స్ వాడకం, సోలార్ పంపుసెట్ల సబ్సిడీ వంటి ఆలోచనలు కూడా వినిపిస్తున్నాయి. కిసాన్ టి.వీ.ని ప్రారంభించి టెక్నాలజీ ద్వారా రైతులకు సమాచారం చేరవేస్తోంది. పంటల బీమా ద్వారా అతి తక్కువ ప్రీమియంతో పూర్తి బీమాను పొందటం, ప్రైవేటు పెట్టుబడులను వ్యవసాయ రంగంలోకి ఆహ్వానించటం, వ్యవసాయ బీమా పథక విస్తరణ, వ్యవసాయ ఉత్పత్తుల అంతర రాష్ట్ర రవాణామీదున్న ఆంక్షలు ఎత్తివేత, హేతుబద్ధ జలవనరుల వినియోగం ధరల స్థిరీకరణతోపాటు మందుల, విత్తన, ఎరువుల, సరఫరాలోని లోపాలను సరిద్దిటం, గ్రామీణ ప్రాంతాలలో విద్యుదీకరణ, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపన వంటివి చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. కొంత మటుకు సఫలీకృతమయింది కూడా. అయితే రైతులకు కనీస మద్దతుధర ఉండాలనేది ఒక సూచన. కానీ దీనివలన సామాన్యుడికి అందనంత ఎత్తులో ధరలు పెరుగుతాయో అన్న భయంతో

ఈ విషయాన్ని పక్కన పెట్టారు. సబ్సిడీలతో, ఉచితాలతో ఎల్లకాలం ప్రజలను మభ్యపెట్టటం కన్నా వారికి వృత్తి నైపుణ్యాలను పెంచితే ఆదాయం అనేది దానంతటఅదే వస్తుంది ఈ దిశగా నేడు ప్రభుత్వం యోచిస్తున్నట్లు కనిపిస్తోంది.

అయితే ఈ సంవత్సరం అనుకోని విధంగా పెద్ద నోట్లు రద్దు ఆహారభద్రతపై పెనుప్రభావాన్ని చూపబోతోంది. అరకొర సంపాదనతో బతుకు ఈడుస్తున్న ప్రజల మీద ఈ ప్రభావం అమితంగా కనిపిస్తోంది. జౌళి, నిర్మాణ రంగం, వస్త్రోత్పత్తి, చేనేత వంటి అసంఘటిత రంగాలాలోని నిరుపేద కార్మికులపైన నేరుగా దీని ప్రభావం పడింది. వీరికి ప్రస్తుతం పని దొరకటం లేదు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడే, ప్రజలకు పనికివచ్చే ఏకైక సంక్షేమ పథకం – 'ప్రజాపంపిణీ వ్యవస్థ'. దీని ద్వారా పాతనోట్లను మార్చుకునే వెసలుబాటు కలిగించాలి. అరువు మీద తిండిగింజలను ఇవ్వటం, ఆధార్ కార్డు లింక్ ద్వారా ఆహార ధాన్యాలను ఇచ్చే ప్రయత్నం చేస్తున్నా, ఇంకా చిత్తశుద్ధితో చేయవలసిన ఇతర అంశాలు ఎన్నో ఉన్నాయనేది నిర్వివాదాంశం.